శోభి (సుబియం)
మచ్చలతో బాధ పడుచున్నారా ?
కార్బిన్ లోషన్ వాడండి !
అతి త్వరగా తెల్ల మచ్చలు మాయమై
తిరిగి మీచర్మము సహజ వర్ణమును పొందును.
కార్బిన్ లోషన్
Dey's డేస్ మెడికల్ వారి ఉత్పత్తి
TEL-80

# మీకు గుర్తులేదా?

పళ్లు, చిగుళ్ల ప్రపంచంలో ఒక కొత్త అద్భుతం
ఫ్లోరైడ్‌తో
ఫోర్‌హెన్స్ టూత్ పౌడర్

ఫ్లోరైడ్‌యుక్త ఫోర్‌హెన్స్ టూత్ పౌడర్ నిజంగా అద్భుతమైన టూత్ పౌడర్. ఇది ఆధునికమైనది, నురుగు ఇచ్చేది, మెత్తటిది మరియు మృదువైనది. నియమానుసారం దీన్ని ఉపయోగించడం వల్ల పళ్లకు పరిశుభ్రత, చిగుళ్లకు మాలిష్ లభిస్తుంది. దాని ఫలితం గట్టి పళ్లు, ఆరోగ్యమైన చిగుళ్లు!

ఫోర్‌హెన్స్ టూత్ పౌడర్‌ను నియమానుసారం ఉపయోగిస్తే పళ్లు, చిగుళ్ల బాధలు ఉండవు. దంత వైద్యుడు సృష్టించిన ఫోర్‌హెన్స్ టూత్ పేస్ట్ ఉత్పత్తి దారులే దీనిని కూడా ఇప్పుడు తయారు చేశారు.




180 గ్రా., 90 గ్రా., 45 గ్రా. డబ్బాలలో లభిస్తుంది.

187 F 162 Tel

చాలాకాలం తరవాత మళ్ళీ సారథి ఉత్తరం రాశాడు.

ముఖ్యమైన విశేషాలంటే తప్ప సాధారణంగా సారథి ఉత్తరం రాయడు... వాడు జంషెడ్‌పూర్ వెళ్ళిన తరవాత ఈ ఏడేళ్ళల్లోనూ నాకు ఉత్తరాలు రాసిన సందర్భాలు వేళ్ళ మీద లెక్క పెట్టచ్చు...

ఉద్యోగంలో చేరటానికి ఆ వూరు వెళ్ళినప్పుడు క్షేమంగా చేరినట్టు రాశాడు... విశాఖపట్నం నుంచి వాడి భార్యను కాపురానికి తీసుకెళ్ళినప్పుడు మరోసారి రాశాడు. విశాఖ వరకూ వచ్చినవాడు అప్పుడు నిడదవోలు కూడా వస్తాడేమోనని రాజ్యంతో బాటు నేనూ ఎదురు చూశాను...కానీ సెలవు దొరకలేదట... అందుకే 'రాలేకపోయా' నంటూ క్షమాపణలు కోరుకున్నాడు ఆ ఉత్తరంలో.

కంపెనీ వాళ్ళు క్వార్టర్స్ ఇచ్చినప్పుడు ఇంకో సారి రాశాడు ఉత్తరం, ఆ క్వార్టర్ ఎంతో సౌకర్యంగా ఉందనీ ముందు విశాలమైన గార్డెన్ ఉందనీ. సాయంత్రం పూట తోట పనితో బాగా కాలక్షేపం అవుతూందనీ రాశాడు..

ఆ తరవాత, వాడి భార్యను మొదటిసారి పురిటికి పంపేటప్పుడు మరోసారి ఉత్తరం రాశాడు.

వాడికి కొడుకు పుట్టినప్పుడు బారసాల చేసుకునేందుకు అత్తవారింటికి వచ్చేడు. ఆ సందర్భంలోనే మేం కూడా విశాఖపట్నం వెళ్ళాం... రెండేళ్ళ తరవాత మళ్ళీ సారథిని చూడటం అప్పుడే!

"మీ ఆరోగ్యం ఎలా ఉంటోంది?" అని అడిగేడు సారథి అప్పుడు.

"ఈ మధ్య అస్తమానూ తలనొప్పి వస్తూంటే మొన్నీ మధ్య డాక్టరుకి చూపించుకున్నారు. 'బీపీ' ఉందని మందులేవో రాసిచ్చారు డాక్టరు గారు!" రాజ్యం చెప్పింది.

"జంషెడ్‌పూర్ వచ్చేయండి. అక్కడ డాక్టర్‌కి చూపించి వైద్యం చేయిస్తాను!"— అని అంటాడనుకుని క్షణంలో సగం సేపు సారథి వైపు చూశాను.

కానీ వాడేం మాట్లాడకుండా నిర్లిప్తంగా వూరుకున్నాడు.

అసలు చిన్నతనం నుంచి వాడి తత్వమే అంత. నాతో ఎక్కువ మాట్లాడటం అలవాటు లేదు వాడికి. ఏం కావాల్సినా వాళ్ళ అమ్మనే అడిగేవాడు... రాజ్యానికి వాడంటే చాలా గారం... నాకు తెలియకుండా వాణ్ణి సినిమాలకు పంపించిన సందర్భాలూ, హోటల్లో చిరుతిళ్ళు తినట్నానికి డబ్బులిచ్చిన సంఘటనలూ ఎన్నో ఉన్నాయి.

మొదటి సంతానం మీద ప్రతి తల్లికీ ఆ ఆపేక్షా అనురాగం ఉంటాయేమో మరి!

బారసాల చేసుకుని మూడో రోజున సారథి తిరిగి వెళ్ళిపోతూంటే గుమ్మం దాకా వెళ్ళి వాడు రిక్షా ఎక్కుతూంటే అంది రాజ్యం —

"నువ్ ఉత్తరాలు రాయటం లేదని నాన్న గారు ఎంత బాధ పడుతూంటారో తెలుసా? పది

రోజుల కోసారైనా ఒక ఉత్తరం ముక్క రాస్తాడు!''

అప్పుడు — రాజ్యం అలా అంటున్నప్పుడు నేను చూళ్ళేదు కానీ, తన కళ్ళల్లో కన్నీటి పొరలు కదిలే ఉండాలి. రిక్షా వెళ్ళి పోయిం తరవాత పైట చెంగుతో కళ్ళొత్తుకుంటూ లోపలి కొచ్చింది.

ఆ రాత్రి — మేం ఇద్దరం తిరిగి నిడదవోలు వచ్చేస్తూండగా — రైల్లో అడిగాను రాజ్యాన్ని —

''నీ పెద్దకొడుకు ఉత్తరాలు రాయటం లేదని, నీ దగ్గర నేనెప్పుడైనా బాధ పడ్డానా?''

మీ ప్రశ్నలోనే ఉంది జవాబు... నా దగ్గర దాచకండి!'' — నెమ్మదిగా నా కళ్ళల్లోకి చూసి చెప్పింది.

నిజమే...

భర్త కట్టిన మాంగల్యం భార్య గుండెల్పై ఒండిపోవటం వల్లనేమో — ఒకరి మానసిక స్పందన మరొకరికి అర్థమై పోతుంది!

సారధి ఉత్తరాలు రాయనందుకు నేను మనసులోనే కలతపడిన సందర్భాలు ఎన్నో ఉన్నా — ఎప్పుడూ రాజ్యం దగ్గర బయట పడలేదు.

కానీ... రాజ్యం మాత్రం పోస్ట్‌మేన్ వచ్చేవేళకు వీధి గుమ్మం కాస్తుంది.


సరిగా ఒంటి గంటకి వస్తాడు పోస్ట్‌మేన్... అప్పటికి నేనో కునుకుతీయటం అయిపోతుంది. కానీ రాజ్యానికి మాత్రం నిద్ర పట్టదు.. ఒకవేళ ఉత్తరం వస్తుందేమో అనే ఆశ నిద్ర పోనివ్వదు. ఒంటి గంటకి మా ఇంటిని పట్టించుకోకుండా పోస్ట్‌మేన్ ముందుకు వెళ్ళిపోయిం తరవాత — అప్పుడు మంచం మీద నడుం వాలుస్తుంది.

'ఇవాళ కూడా ఉత్తరం రాలేదు!''—తనలో తాను అనుకుంటున్నట్టు నాకు చెబుతుంది.

'నీ పిచ్చి కాకపోతే సారధి ఉత్తరం రాస్తాడని ఎలా అనుకుంటున్నావ్?' అని ఎప్పుడైనా మాట వరసకి నేనంటే—

''వాడే రాయాలా? ఇంకెవరి దగ్గర్నుంచీ ఉత్తరాలు రాకూడదా?'' — అని దబాయిస్తుంది.

నిజానికి ఉత్తరాలు రాసేవాళ్ళు ఇంకెవరూ లేరన్న సంగతి తనకూ తెలుసు. రెండోవాడు



శ్రీధర్‌కి, పక్క వూళ్ళోనే ఉద్యోగం కావటంవల్ల రోజూ ఇంటి దగ్గర్నుంచి సైకిలు మీదే ఆఫీసుకి వెళ్ళొస్తుంటాడు... ఇక మూడో వాడు గోపాలం... నా దగ్గరే ఉంటూ ఇంకా కాలేజీ చదువు వెలగబెడుతున్నాడు.

ఇక ఉత్తరాల కోసం ఎదురు చూసేలా చేసేది సారథి ఒక్కడే!...

వాడి దగ్గర్నుంచే — చాలాకాలం తరవాత ఇప్పుడు మళ్ళీ ఉత్తరం వచ్చింది.

"ఏం రాశాడండీ?"— ఆత్రంగా అడిగింది రాజ్యం,

అంతకంటే ఆత్రంగా అందులోని విషయాలు చదువుతున్నాను.

"పైకి చదవండి. నేనూ వింటాను!' హెచ్చరించింది.

"నాన్నగారికి నమస్కారములు. మీరు, అమ్మా కులాసా అని తలుస్తాను, చి. బాబిగాడు అల్లరి జాగా చేస్తున్నాడు. కాన్వెంట్‌లో చేర్పించాం! అన్నట్టు వారం రోజుల క్రితమే స్కూటరు కొన్నాను. అస్తమానూ దాని మీద ఎక్కించి తిప్పమని బాబిగాడు నూరాం చేస్తున్నాడు... మీ కోడలు క్షేమం... ఇంతే సంగతులు..."—చదివి వినిపించేను.

"పోన్లెండి... స్కూటరు మీరు కొనుక్కో లేకపోయినా మీ అబ్బాయి కొన్నాడు." నవ్వుతూ అంది రాజ్యం.

ఆ మాట వినగానే — ఆనందమో తెలీదు, ఆరాటమో తెలీదు — మనసంతా కొన్ని క్షణాలు అల్లకల్లోలమైపోయింది.

అలజడి చెలరేగిన మనసులో ఎన్నెన్నో జ్ఞాపకాలు...

మా పెళ్ళికి లగ్నపత్రిక వేసినప్పుడు — స్కూటరు కావాలని మామగార్ని అడిగేను...

దానికి కొంత 'టైం' పడుతుందని చెప్పి అప్పటికి 'టైం' చూసుకునేందుకు ఒక రిస్టు వాచీ కొనిచ్చారు..

ఆ తరవాత ఒక సారి పండక్కి వెళ్ళినప్పుడు —రాజ్యం ద్వారా స్కూటరు విషయం గుర్తు చేశాను మామగారికి.

ఆ ఏడు పంటలు దెబ్బ తిన్న కారణంచేత, చేతిలో డబ్బులేదనీ మరో రెండేళ్ళు పోయాక తప్పకుండా ఏర్పాటు చేస్తాననీ, దాట పెట్టేరు ...

రెండేళ్ళ తర్వాత, మరోసారి నా చేత అడిగించుకునే అవకాశం ఇవ్వకుండా ఆయనే దాటిపోయారు. అక్కడితో స్కూటరు విషయం మరచిపోవాల్సి వచ్చింది. మళ్ళీ దాన్ని జ్ఞాపకం చేసుకోవటానికి అవకాశం లేకుండా బరువులూ, బాధ్యతలూ పెరిగేయి. పిల్లలూ పెరిగేరు. ఉద్యోగంలో నాలుగు మెట్లు పైకెక్కేసరికి సారథి కాలేజీలో చేరాడు.

అప్పట్లో స్కూటరు కొనుక్కోటానికి ఆఫీసులో మూడు వేలు అడ్వాన్సు ఇస్తామన్నారు. నాలో అణగారిపోయిన - కోరిక మళ్ళీ విశ్వరూపం దాల్చింది. బాంకులో అప్పుడూ అప్పుడూ పదీపరకా దాచిన డబ్బంతా కలిపి రెండు వేల దాకా ఉంది. అంతా కలిపితే స్కూటరు వచ్చేస్తుంది. అవసరమైతే మరికొంత అప్పు చేసినా ఫరవాలేదు.

ఆ ఆలోచన రాగానే స్కూటరు అడ్వాన్సుకోసం ఆఫీసులో దరఖాస్తు పెట్టాను. పది రోజుల్లో డబ్బు చేతికొచ్చింది.

వెంటనే డీలర్ దగ్గరికెళ్ళాను. ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకుంటే ఆయిదారునెల్లో స్కూటరు ఇస్తామన్నారు. వంద రూపాయలు కట్టి రిజిస్ట్రేషన్ చేయించను

సరిగ్గా ఆ సమయంలోనే ఇంటర్ పరీక్షా ఫలితాలు వచ్చేయి. సారథి ఫస్టుక్లాసులో పాసయ్యేడు. బియస్సీకి దరఖాస్తు పెట్టమన్నాను. కానీ ఇంజనీరింగ్ చదువుతా నన్నాడు. ఇంజనీరింగ్ చదవటమంటే మాటలతో అయ్యేపని కాదు. ముందు సీటు రావటమే గగనం. సీటొచ్చిం తర్వాత ఫీజులనీ, పుస్తకాలనీ బోలెడంత ఖర్చు. పోనీ ఏ 'షెడ్యూలు కేస్టు' అయ్యుంటే కొంతలో కొంత మేలు జరిగేది.

ఆ మాటే చెప్పేను. కానీ వాడి పట్టుదల వాడిది! దానికితోడు వాడికి రాజ్యం సత్తాసు కూడా దొరకటంతో అసహాయుణ్ణయి పోయేను.

ఇంజనీరింగ్ సీటుకోసం ఎన్నో కాలేజీలకు దరఖాస్తులు పంపించాడు. చాలాచోట్ల ఎంట్రెన్సు పరీక్షలు రాశాడు. కానీ ఎక్కడా సీటు దొరకలేదు. ఇహ, బియస్సీలో చేరా లనుకుంటూ ఉండగా రాంచీలో సీటుందని రమ్మన్నారు. డొనేషన్ కట్టడానికి రెండు వేలు కూడా తెమ్మన్నారు.

ఆలోచనలో పడ్డాను.

తల్లీ కొడుకులు మళ్ళీ ఏకమయ్యారు. ఈసారి నాకు తప్పింది కాదు. స్కూటరుకోసం డ్రా చేసిన డబ్బంతా ఇచ్చి సారథిని రాంచీ పంపించాను.

"దేనికైనా యోగమనేది ఒకటుండాలంటారు! స్కూటరు యోగం నా జాతకంలో లేదు... అంతే!" అనుకున్నాను. ఆ మాటే రాజ్యంతో అంటే—

"పోన్లెద్దురూ! మన పిల్లలు పెద్ద చదువులు చదువుకుని గొప్పవాళ్ళయితే చాలదూ? రేపు వాడు ఒక ఇంజనీరైతే మీకు స్కూటరు కొనివ్వక పోతాడా? అంది నవ్వుతూ.

అంతే!



అకలి — ఫోటో : శ్రీనివాస్

స్కూటరు విషయం మళ్ళీ మర్చిపోవాల్సివచ్చింది. రానురాను కుటుంబంలో ఖర్చులూ పెరిగాయి. వాటితో పోటీ పడుతూ — అందిన దానితో రాజీ పడుతూ ఉద్యోగ పర్వం పూర్తి చేసేసరికి, స్కూటరెక్కి షికార్లుచేసే వయసూ దాటిపోయింది.

ఇప్పుడు ...

సారథి రాసిన ఉత్తరం చూశాక, మళ్ళీ మనసంతా అందుకే — ఆనందంతోనో, ఆరాటంతోనో ఉక్కిరిబిక్కిరై పోయింది.

"ఒకసారి జెంషెడ్ పూర్ వెళ్ళొద్దామా?" అడిగాను రాజ్యాన్ని ఆ రాత్రి.

"ఏం? గాలి అటు మళ్ళిందేం?"

"నీ మనవణ్ణి చూడ్డానికైనా ఒక సారి!"

"డొంకతిరుగుడెందుకూ? కొడుకు స్కూటరెక్కించుకుని వూరంతా వూరేగిస్తే, ఉబలాటం తీర్చుకుందామని అయ్యగారి ఆశ!" నవ్వేస్తూ అంది.

"పోనీ అలాగే అనుకో! అయినా తప్పా? వాడి స్కూటరెక్కే హక్కు నాకు లేదా? ఎక్కించుకు తిప్పే బాధ్యత వాడికి మాత్రం ఉండదా?" గర్వంగానే అన్నాను.

"డబ్బులేని వాడు డోడ ముండెక్కేట్టు! అలా ఉంది!" పరిస్థితి గుర్తు చేసింది రాజ్యం.

నిజమే మరి. వచ్చే పెన్షన్ డబ్బుతో ఎవరిమీదా ఆధారపడకుండా రోజులు గడుస్తున్నాయి. ఇప్పుడు జంషెడ్ పూర్ వెళ్ళాలంటే కనీసం రెండు మూడు వందలైనా కావాలి.

"పోనీ మీరొక్కరూ వెళ్ళిరండి. నేను ఇప్పుడు రావాలంటే కష్టం కూడానూ! అవతల గోపాలానికి వచ్చే నెలలో పరీక్షలు... శ్రీధరానికి వంటావార్పూ రాదాయె! వాళ్ళిద్దర్నీ వదిలి నేను ఎలా రాగలనూ?" నా ఆలోచనల్ని పసిగట్టిన దానిలా సలహా ఇచ్చింది రాజ్యం.

నిజానికి జంషెడ్ పూర్ రావాలని మనసులో తనకూ ఉంది. కానీ ఇల్లాలిగా తన బాధ్యత తనకు తెలుసు. కనీసం నేను వెళ్ళొస్తే, నేను పొందే తృప్తిలో — అర్ధాంగిగా తానూ సగపాలు పంచుకోవచ్చునని ఆశ! అంతే!

సారథికోసం కాకపోయినా, మనవడి ముద్దుమురిపాలు చూడాలనే కాంక్ష లేకపోయినా, స్కూటరు మోజు తీర్చుకోవాలనే ఆశతో జంషెడ్ పూర్ వెళ్ళటానికే నిర్ణయించుకున్నాను.

ఫలానా రోజు బండిలో బయల్దేరి వస్తున్నానని ముందుగా సారథికి ఉత్తరం రాసి బయల్దేరాను. జంషెడ్ పూర్‌లో రైలు దిగేసరికి సారథి కనిపించాడు.

స్టేషన్‌లోంచి ఇద్దరం బయటి కొచ్చాం.

"ప్రయాణం బాగా జరిగిందా?" అడిగాడు.

"వూ!"

"అమ్మ కులాసాగా తిరుగుతుందా?"

"ఆ!"

"వచ్చేనెలలో గోపాలానికి పరీక్షలు కాబోలు!"

"......"

"అమ్మను కూడా తీసుకురావాల్సింది!"

అలా సారథి ఏమిటేమిటో అడుగుతున్నాడు.

ముక్త సరిగా సమాధానాలు చెప్తూనే ఉత్సాహంతో చుట్టూ చూశాను. వాడు తెచ్చిన స్కూటరుకోసం.

"టాక్సీ!" పిలిచాడు సారధి.

నా ఉత్సాహం కాస్త నీరుకారిపోయింది.

"స్కూటరు తీసుకు రాలేదా?" అడిగాను.

"పెట్రోలు అయిపోయింది. ఇవాళ పోయిం చాలి!" టాక్సీ ఎక్కుతూ చెప్పేడు.

పది నిమిషాల్లో ఇంటికి చేరుకున్నాం.

లోపలకు అడుగు పెట్టేసరికి హాల్లో గోడవారన, నీలం రంగులో నిగనిగలాడుతున్న స్కూటరు కనిపిం చింది. నా కెంతో ఇష్టమైన రంగు.

"స్కూటర్ కలర్ చాలా బాగుంది!" తృప్తిగా చూస్తూ చెప్పాను.

అంతలోనే 'డాడీ' అంటూ బాబిగాడు గదిలోంచి వచాడు.

"కమాన్! ... ఈయ నెవరో తెలుసా? తాతయ్య గారు ... గుడ్‌మార్నింగ్ చెప్పమ్మా!" వాణ్ణి ఎత్తు కుని నా దగ్గరికి తీసుకొచ్చాడు సారధి.

"మీ అబ్బాయిగారి గొప్పతనం తీరుబడిగా చెబుదురుగాని... ముందు మామయ్యగార్ని లోపలకు రానివ్వండి!" కాఫీ గ్లాసుతో వచ్చింది కోడలు.

మళ్ళీ ఉభయ కుశలోపరి—

ఆ రోజంతా ప్రయాణపు బడలికతోనే గడిచి పోయింది. మర్నాడు పొద్దున్న స్కూటరు మీద బాబిగాణ్ణి ఎక్కించుకుని కాన్వెంటుకి తీసుకెళ్ళి దిగబెట్టి వచ్చాడు సారధి.

మూడో రోజున ఆఫీసునుంచి వచ్చిం తర్వాత నన్ను స్కూటరు మీద తీసుకెళ్ళి వూరు చూపిస్తా డేమోనని ఆశగా ఎదురు చూశాను.

"వూరు పెద్దదేగానీ ఇక్కడచూసేందుకు ఏమీ లేవు, నాన్నా! ఈ టౌన్‌షిప్పుకీ, వూరుకీ చాలా దూరం. సినిమాలకు వెళ్ళాలన్నా కష్టమే!" ఆ రాత్రి భోజనాలు చేస్తుంటే ఏదో సందర్భంలో అన్నాడు సారధి.

నాలుగో రోజున వాడు ఆఫీసుకి వెడుతూంటే, నేనే చెప్పాలని అనుకున్నాను — "ఇవాళ సాయంత్రం తొందరగా వస్తే అలా వూళ్ళోకి పోయొద్దాం" అని.

ఈ లోగా సారధే అన్నాడు —

"ఇవాళసాయంత్రం మా క్లబ్‌హాల్లో బాలమురళి కచేరీ ఏర్పాటుచేశాం ... రెడీగా ఉండండి! వెడదాం!"

నాకు ప్రాణం లేచివచ్చినట్లనిపించింది.

క్లబ్బుకి ఎలాగూ స్కూటరు మీద తీసుకెడ తాడు. పైగా బాలమురళీ కృష్ణ కచ్చేరీ రేడియోలో వినటమేగాని నే నెప్పుడూ చూడలేదు. ఇప్పుడు స్కూటరు ఎక్కాలనే చిరకాల వాంఛతోపాటు, ఆయన కచేరీని చూసే అవకాశం కూడా కలిసొచ్చింది

సాయంత్రం అయిదయేసరికి రెడీ అయి కూర్చున్నాను.

ఐదింటికి సారధి ఆఫీసునుంచి వచ్చేడు. కానీ స్కూటరుమీద రాలేదు. ఎవరిదో కారు తీసు కొచ్చేడు.

"స్కూటరేమైందిరా?" అడిగాను—నిరుత్సా హాన్ని గుండెల్లోనే దాచేసుకుని.

"స్కూటరు మా ఫ్రెండు కిచ్చి అతని కారు తెచ్చాను! మనం అందరం వెళ్ళాలంటే కారు కావాలి కదా మరి!"

అదే నిరుత్సాహంతో మరో రెండు రోజులు గడిచిపోయాయి.

ఆ రోజు మధ్యాహ్నం పేపరు చూస్తుంటే బాబిగాడు నా దగ్గర కొచ్చాడు. వాడి చేతిలో ఏదో బొమ్మల పుస్తకం ఉంది.

"తాతయ్యా! ఇందులో స్కూటర్ బొమ్మ ఉంది!" ఆ బొమ్మను చూపిస్తూ అన్నాడు.

"డాడీ స్కూటర్లాగే ఉంది కదూ ఇదీ?" నేను ఆ బొమ్మవైపు చూస్తుంటే అడిగాడు.

"అవును!"

"డాడీ స్కూటరు మీద స్కూలుకి నన్ను ఎంత స్పీడుగా తీసుకెడతాడో ...! కొంచం పెద్దయ్యాక నేనూ స్కూటర్ నేర్చుకుంటాను తాతయ్యా! డాడీలాగే స్పీడుగా తొక్కుతాను!"

"నన్ను కూడా స్కూటరెక్కించుకుని స్పీడుగా తొక్కమని ఇవాళ మీ డాడీని అడుగుతాను!"

"నిన్ను ఎక్కించుకోడుగా!"

ఆ మాట వినగానే తెల్లబోయాను.

"ఏం? ... ఎందుకనీ?"

"నువ్ ముసలాడివి కదూ! అందుకని! కొత్త స్కూటరు మీద ముసలాళ్ళు ఎక్కకూడదట... మమ్మీ, నేనూ అందంగా ఉంటాంకదూ! అందు కని ఎప్పుడూ మేమే ఎక్కాలి!"

"ఎవరన్నారురా?" వాణ్ణి దగ్గరకు తీసుకుంటూ అడిగాను.

"డాడీ!"

కోరిక నిండిన గుండెలపై కమ్చీతో చెళ్ళున కొట్టినట్లయింది.

అంటే ... నేను కేవలం ముసలాణ్ణే. తప్ప, సారధికి నేనేం కానా? ...

అంతే!!

తమ కాళ్ళమీద తాము నిలబడేవరకే పిల్లలకి తల్లీ తండ్రీ కావాలి. గూటిలో పక్షి పిల్లలు రెక్కలు వచ్చేవరకే ఒదిగి మదిగి ఉంటాయి. ఏ క్షణాన్నో ఆ రెక్కల్లోకి సత్తువ వచ్చినప్పుడు, కనీసం తల్లి పక్షి క్కూడా తెలియకుండా అనంతాకాశంలోకి ఎగిరి పోతాయి. మళ్ళీ ఆనవాలు పట్టేందుకయినా అవి కనిపించవ్ ...

ఎదిగిన పిల్లలుకూడా రెక్కలొచ్చిన పక్షులే! వయసుతోబాటే వాళ్ళ భావాలూ మారిపోతాయి. తమ భార్యాపిల్లలూ, తమ ఇల్లూ, తమ సంపదా ఇవన్నీ తమ జీవన విధానంతో పెనవేసుకుంటున్న కొద్దీ తల్లిదండ్రులతో పెంచుకున్న ఆత్మీయతా, ప్రేమానుబంధాలూ బలహీనపడిపోతాయి. అప్పుడు కన్నవారి పట్ల పిల్లలకు మిగిలేది బాధ్యత కావచ్చు నేమో కానీ, భావోద్రేకంమాత్రం కాదు.

స్కూటరెక్కాలనే వాంఛ మరోసారి... చివరిసారి అందుకే నాలో అణగారిపోయింది.

ఆ మర్నాడే బయల్దేరి అక్కడి నుంచి వచ్చేశాను.

ఇంటికొచ్చీ రాగానే నిలవనీయకుండా విశేషాలు అడిగి ఉక్కిరి బిక్కిరి చేసింది రాజ్యం.

"ఇంతకీ స్కూటరు మోజు తీరిందా అయ్య గారికీ?" అడిగింది ఆ తర్వాత.

"ఆ! తీరిపోయింది. ఉన్న వారం రోజులూ స్కూటరెక్కించుకుని కరువుతీరా తిప్పాడు నీ కొడుకు! ఇహ ఈ జన్మకి ఆ సరదా ఉండదులే!" అన్నాను తెచ్చిపెట్టుకున్న నవ్వుతో.

తృప్తిగా నిట్టూర్చింది రాజ్యం ... ✱


కొత్త శీఘ్ర-చర్యగల సూపర్
వాస్మాల్ 33
తెల్ల వెంట్రుకలు పూర్తిగా మరియు సహజంగా నల్లబడుతాయి.
కేవలం 3 రోజుల్లో
సూపర్ వాస్మాల్ 33 వైజ్ఞానిక పద్ధతిలో తయారు చేయబడిన
జిడ్డులేని హెయిర్ ఆయిల్. ఇది మీ వెంట్రుకలను ఎల్లప్పటికీ
ఆరోగ్యంగా, నల్లగా, నిగనిగలాడేలా
వుంచుతుంది.



హైజెనిక్ రిసెర్చ్
ఇన్‌స్టిట్యూట్
పి. ఒ. బాక్స్ 1192
బొంబాయి 400 001
అన్ని కెమిస్టు దుకాణాలలో మరియు మీకు చేరువలోనున్న ప్రముఖ
దుకాణాలలో లభిస్తుంది.
nationl 694 TL.